# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 259
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జూలై 16, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## జవాబుదారీగా ఉండాలి

- అదే పోలీసుల కర్తవ్యం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





వివరాలు 2లో..

# 23న 'లోకల్' కోడ్ !

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు తాజాగా జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలంటూ సూచించింది. పోలింగ్ సిబ్బంది వివరాలను మరోసారి పరిశీలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఈనెల 23న స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రానున్నట్లు ప్రచారం సాగుతోంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులకు అవసరమైన సూచనలు కూడా చేసింది. ఎంపీటీసీ ఎన్నికల తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీసీ రిజర్వేషన్లు కీలక అంశంగా మారాయి. తెలంగాణ కేబినెట్ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన ఆర్డినెన్స్ ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉంది. 2018 పంచాయతీరాజ్ చట్టం రాష్ట్ర పరిధిలోనిదే కావడంతో గవర్నర్ దగ్గర ఆలస్యం జరగదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ రాగానే రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనుంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి




- స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోండి
- కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశాలు
- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై కీలక అప్డేట్
- పోలింగ్ సిబ్బంది వివరాలు మరోసారి పరిశీలించాలంటూ ఆదేశం
- గ్రామాల్లో మొదలైన సందడి
- తగ్గిన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు




2లో..

## ఆశ్రమ పాఠశాలలో వసతులు కరువు

- సోదాలు చేసిన ఏసీబీ
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు
- తనిఖీల అనంతరం ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందజేత
- ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

## కళాఖండాలు ఉంటే ఇవ్వండి

చరిత్ర పరిరక్షణ, భవిష్యత్ తరాల అవగాహనకు సేకరణ
జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న
ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు విజ్ఞప్తి



8లో..



8లో..

## ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతా..

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
- నియోజకవర్గ అభివృద్ధే నా ఏకైక ఎజెండా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## వరంగల్‌ను ఒకే జిల్లాగా మార్చండి

- వేర్వేరు జిల్లాలతో కుంటుపడిన అభివృద్ధి
- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ




2లో..

# 23న 'లోకల్' కోడ్!

- స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోండి
- కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశాలు
- సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలపై కీలక అప్డేట్
- పోలింగ్ సిబ్బంది వివరాలు మరోసారి పరిశీలించాలంటూ ఆదేశం
- గ్రామాల్లో మొదలైన సందడి
- పెరిగిన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు






**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందడి మొదలైంది. గత సంవత్సర కాలంగా గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో, ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామాల పాలన కొనసాగుతోంది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో కదలిక వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీసీ రిజర్వేషన్లు కీలక అంశంగా మారింది. తెలంగాణ కేబినెట్ ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూపొందించిన ఆర్డినెన్స్ ను గవర్నర్ కు పంపించింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా ఎటువంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చూస్తోంది. అందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 285 (ఏ)లోని 50 శాతం సీలింగ్ అనే పదాన్ని తొలగించడంతోపాటు, ఇతర సెక్షన్లలోనూ పలు సవరణలు చేయనుంది. ఈ విషయాన్నే పేర్కొంటూ గవర్నర్‌కు ఫైలును పంపింది. అలాగే రాష్ట్రంలో రిజర్వేషన్లను పెంచాల్సిన ఆవశ్యకతతో పాటు.. కులగణన వివరాలను కూడా గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించినట్టు తెలిసింది. 2018 పంచాయతీరాజ్ చట్టం రాష్ట్ర పరిధిలోనిదే కావడంతో గవర్నర్ దగ్గర ఆలస్యం జరగదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

### ఉత్సాహంలో అధికార పార్టీ..

స్థానిక ఎన్నికల సమరంపై కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. బీసీ రిజర్వేషన్లు తమను గట్టెక్కిస్తాయని భావిస్తున్నారు. గ్రామస్థాయిలో బీసీ నేతలంతా ఇప్పుడు కాంగ్రెస్ జెండా పట్టుకుని ఊరేగుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేడర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమ సత్తా చాటేందుకు సమాయత్తం అవుతున్నారు. బీసీలకు రిజర్వేషన్లతో పాటు రైతులకు రుణమాఫీ, రైతుభరోసా వంటి కార్యక్రమాలను కూడా కాంగ్రెస్ ఇప్పటికే ప్రచారం చేసుకుంటోంది. కేడర్ కూడా ఉత్సాహంగా ముందుకు సాగుతోంది.

### బెడిసి కొట్టిన కవిత ప్లాన్..

బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల చుట్టూ ఇప్పుడు తెలంగాణ రాజకీయం కేంద్రీకృతమైంది. ఈ వ్యవహారంలో అధికార కాంగ్రెస్ రెండాకులు ఎక్కువే చదివింది. రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని కులగణన చేపట్టడంతోపాటు బీసీ రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ప్రతిపాదించింది. బీసీల ఉద్యమాన్ని నెత్తికెత్తుకునే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. పదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడు బీసీల గురించి మాట్లాడని బీఆర్ఎస్ నేతలు గద్దె దిగగానే బీసీ నినాదం ఎత్తుకోవడం కేవలం రాజకీయ ఎత్తుగడగానే ప్రజలు భావిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పేటెంట్ కాంగ్రెస్ దక్కించుకుంది. దీనినే ప్రధాన ఎజెండాగా చేసుకుని అడుగులు వేస్తోంది. విపక్ష పార్టీలకు సవాళ్లు విసురుతోంది.

### కోర్టు ఆదేశం..

కాగా, తెలంగాణ హైకోర్టు కూడా ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు నెలల్లోపు నిర్వహించాలని ఆదేశించింది. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను 30 రోజుల్లో పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి సహకరించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ప్రభుత్వం సమ్మతి తెలిపిన తర్వాత 60 రోజుల్లోపు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పూర్తి చేసి, ఫలితాలు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

### కలెక్టర్లకు ఆదేశం..

కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల సంఘం తమ కసరత్తును ముమ్మరం చేసింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది డేటాను సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఫిబ్రవరి నెలలో నమోదైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఈసీ సూచించింది. అలాగే, రాష్ట్రంలోని జిల్లా, రెవెన్యూ, డివిజన్, మండలం, పంచాయతీలతో పాటు వార్డుల సంఖ్య ఆధారంగా పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ తాజా ఆదేశాలతో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులకు అవసరమైన సూచనలు కూడా చేసింది. ఎంపీటీసీ ఎన్నికల తర్వాతే సర్పంచ్ ఎన్నికలు ఉంటాయన్న ప్రచారం సాగుతోంది.


### స్థానాల్లో మార్పులు..

రాష్ట్ర వ్యాప్తంగా 71 గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కలవడంతో భారీగా మార్పులు జరుగనున్నాయి. 2019 ఎన్నికల్లో 5,817 ఎంపీటీసీలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 5,773 కు తగ్గింది. గతంకంటే 44 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. అదే విధంగా ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు గతంలో 539 ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 566కు పెరిగింది. గతంలో గ్రామ పంచాయతీలు 12,769 ఉండగా వాటి సంఖ్య 12,777కు పెరిగింది. అయితే వార్డు సంఖ్య మాత్రం గతంలో 1,13,136 ఉంటే ప్రస్తుతం 1,12,700 ఉన్నాయి.

# ఆశ్రమ పాఠశాలలో వసతులు కరువు

- సోదాలు చేసిన ఏసీబీ
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కార్పొరేట్ విద్యారంగానికి దీటుగా ప్రతి నిరుపేద విద్యార్థినికి నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం మహబూబాబాద్ లో ఏర్పాటు చేసిన గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కనీస వసతులు కరువయ్యాయని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతలు, విజిలెన్స్, ఐటీడీఏ, స్టేట్ ఆడిట్ అధికారులు పాల్గొన్నారు. పాఠశాలలో అధికారులు కలియతిరుగుతూ విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన భోజన సౌకర్యాలు, నిల్వ సరుకులు, వసతితోపాటు మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. పలు ఆరోపణల నేపథ్యంలో ఈ పాఠశాలలో తనిఖీలు చేపట్టామన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, మరుగు దొడ్లు అపరిశుభ్రంగా మారాయని, కనీసం బాత్రూంలకు తలుపులు కూడా లేవన్నారు. మెను పాటించడం లేదని, పాఠశాల నిర్వహణ, సరుకుల నిల్వ, స్టాక్ రిజిస్టర్ మెయింటనెన్స్ సరిగా లేదని, నాణ్యమైన భోజన ప్రమాణాలు పాటించడం లేదన్నారు. తనిఖీల అనంతరం ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందజేయనున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు.

# వరంగల్‌ను ఒకే జిల్లాగా మార్చండి

- వేర్వేరు జిల్లాలతో కుంటుపడిన అభివృద్ధి
- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వరంగల్ మహానగరాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా విభజించడంతో ఈ ప్రాంత అభివృద్ధి కుంటుపడిందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఛైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు జిల్లాల ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి తిరిగి వరంగల్ జిల్లాగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో రెండు జిల్లాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వరంగల్ నగరం హైదరాబాద్‌లాగే అతిపెద్ద అభివృద్ధి కేంద్రంగా ఎదుగుతుందని నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, బుద్ధిజీవులు ఆశించారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో వరంగల్ కేంద్రంగా ఉద్యమకారులు, వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, యువతలో ఆశలు చిగురించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ, సకల అభివృద్ధి రంగాలు సమ ఉజ్జీగా అభివృద్ధి జరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ కాలగర్భంలో కలిసిపోయిందని, కాకతీయ యూనివర్సిటీ, ఎల్‌బీ కళాశాల, సీకేఎం వంటి విద్యా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి మాట్లాడుతూ 33 జిల్లాలలో వరంగల్ ఉమ్మడి జిల్లాలు 25 నుంచి 33 స్థానాల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను నిర్లక్ష్యం చేయడం వల్లనే గత పాలకులను శాసనసభ ఎన్నికలలో ఓడించడం జరిగిందని, నూతనంగా ఎన్నికైన రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషిచేసి వరంగల్ మహానగరాన్ని ఒకే జిల్లాగా మార్చి ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడానికి నాయకత్వం ముందుకు రావాలని కోరారు. ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ ఛైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులందరూ విభేదాలను విస్మరించి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశలో సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, హనుమకొండ రెడ్ క్రాస్ నాయకులు బొమ్మినేని బాపిరెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బట్టి శ్యామ్ యాదవ్, రిటైర్డ్ అధ్యాపకులు వీరమల్ల బాబురావు, జి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

◆ పరకాల బీజేపీ నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పరకాల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెల్లంపల్లి రోడ్డులోని బస్టాండ్ వద్ద కొన్ని సంవత్సరాలుగా డబ్బా దుకాణాలను ఏర్పాటు చేసుకొని 50కి పైగా కుటుంబాలు వివిధ వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గత ప్రభుత్వం వీరందరికీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే, ఆ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కాబట్టి, ఆ నిర్మాణం త్వరగా పూర్తి చేసి చిరు వ్యాపారులకు ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానం కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పరకాల-అంబాల రోడ్డు ఫోర్ లైన్ విస్తరణలో భాగంగా పరకాల బస్టాండ్ జంక్షన్ అభివృద్ధి చెందడాన్ని బీజేపీ స్వాగతిస్తున్నప్పటికీ, చిరు వ్యాపారుల విషయమై సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాలనీలలో చెత్త సేకరణ ఆటోలు వారం రోజులకు ఒక్కసారి మాత్రమే వస్తుండటం వల్ల దుర్గంధం వెదజల్లి ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని నిరంజన్ తెలిపారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కోటి రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన రోడ్డు క్లీనింగ్ యంత్రం పనిచేయడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు.మాంసం వ్యర్థాల సమస్య: పాత పోస్టుమార్టం రోడ్డులో జంతువులను కోసి వాటి వ్యర్థాలను రోడ్డుపై పడేయడం వల్ల కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దీనివల్ల అటుగా వెళ్లే వ్యవసాయదారులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డు డివైడర్ల మధ్య ప్రభుత్వం నిషేధించిన కానోకార్పస్ చెట్లను గుర్తించి వెంటనే తొలగించాలని కూడా బీజేపీ నాయకులు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్ తక్షణమే పరిష్కరించాలని బీజేపీ పరకాల పట్టణ శాఖ కోరింది.

## బీసీలపై మాట్లాడే నైతిక విలువ బీఆర్ఎస్‌కు లేదు



**వరంగల్ వాయిస్, నడికూడ:** బీసీల గురించి మాట్లాడే నైతిక విలువ బీఆర్ఎస్ నాయకులకు లేదని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బీసీలకు ఏం చేసిందో ముందు చెప్పిన తర్వాతే ఈ వర్గంపై మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, ప్రభుత్వంలో వారికి న్యాయబద్ధమైన పదవులను అందిస్తుండటం బీఆర్ఎస్‌కు మింగుడు పడటం లేదని దేవేందర్ గౌడ్ విమర్శించారు. బీసీలపై బీఆర్ఎస్ కపట ప్రేమను, మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని ఆయన సూచించారు. గత ఎన్నికల్లో అత్యధికంగా ఉన్న బీసీలు మీకు ఇచ్చిన తీర్పు సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణలోని బీసీల పట్ల మాట్లాడే హక్కును టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంతో మందికి వివిధ శాఖల్లో పదవులు ఇచ్చిందని, ఈ విషయాన్ని మరిచిపోయి కొందరు మతిస్థిమితం కోల్పోయిన వారిలా మాట్లాడటం సిగ్గుచేటని దేవేందర్ గౌడ్ ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ, తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆయన బీఆర్ఎస్‌కు హితవు పలికారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజినికుమార్ అధ్యక్షతన మడిపల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హసన్‌పర్తి బీఆర్ఎస్ పార్టీ మండల స్థానిక సంస్థల ఎన్నికల ఇంఛార్జి కందుకూరి చంద్రమోహన్, మండల అధ్యక్షుడు బండి రజినికుమార్, అటికమ్ రాజు, ఎంపీటీసీ ఇంఛార్జి, విలేజ్ ఇంఛార్జి బొల్లావేణి రాజు మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు బుర్ర రాజు గౌడ్, ఉప సర్పంచ్ బుర్ర రంజిత్ గౌడ్, ఎంపీటీసీ ఇంద్రయ్య, సీనియర్ నాయకులు ఎల్లన్న, చందర్, వార్డు మెంబర్లు అనిల్, నవీన్, నరేష్, బాలరాజు, యూత్ నాయకులు బుర్ర మహేష్ గౌడ్, చిర్ర ప్రకాష్, సాయి, రంజిత్, సురేష్, రాజు, రామ్ కుమార్, ఆసిఫ్, శ్రవణ్, నితీష్, సునీల్ లడ్డు పాల్గొన్నారు.

# 23న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్




● వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, జూలై 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు నేడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చెయ్యాలి. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి, నిధులు కేటాయించాలి. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలి.విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలి. ఎన్ఈపీ-2020 (జాతీయ విద్యా విధానం-2020) తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలనే పలు డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు అనిల్, నాగరాజు, సాంబ, ఏఐఎస్‌బి రాష్ట్ర కార్యదర్శి, ఏఐడీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు నితీష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, ఏఐపీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు అనిల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్, ఏఐఎస్ఎఫ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ కన్నుమూత

బండా ప్రకాశ్, రాపోలు ఆనంద భాస్కర్ సంతాపం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీ సమాజ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించి, చివరి శ్వాస వరకు వారి అభ్యున్నతికి పరితపించిన ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ బుధవారం ఉదయం 6 గంటలకు తుది శ్వాస విడిచారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు సంతాపం తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ లు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆచార్య ప్రభంజన్ యాదవ్ అకాల మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని రాపోలు ఆనంద భాస్కర్ పేర్కొన్నారు. సామాజిక ఉద్యమకారుడు, సామాజిక శాస్త్రవేత్త, పాత్రికేయుడు, రచయితగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రభంజన్ అస్తమయం తెలంగాణ భవిష్యత్తుకు, బహుజన సామాజిక ఉద్యమాలకు తీరని లోటు అని ఆనంద భాస్కర్ అన్నారు. ఆయన నిష్క్రమణం తనకు తీవ్ర వేదన కలిగించిందని, ఆయన దివ్య ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి మనోధైర్యం కలిగించి, ఆయన ఆశయాలు నెరవేరేలా దారులు సమకూరాలని ప్రార్థించారు.

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి స్వాగతం పలికిన ప్రణవ్



**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహక సమావేశం ఇటీవల కరీంనగర్‌లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంస్థాగత ఇన్‌ఛార్జ్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మొదటిసారిగా కరీంనగర్‌కు విచ్చేయగా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి కూడా హాజరయ్యారు. వారికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వొడితల ప్రణవ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం, కరీంనగర్ పట్టణంలోని ఇందిరాభవన్ (డీసీసీ కార్యాలయం)లో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సన్నాహక సమావేశ కార్యక్రమానికి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు కూడా పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు సూచనలు అందించారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

## ఎమ్మెల్సీ కవితకు 'బీసీ చౌక్' పుస్తకం అందజేత



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గత ఒకటిన్నర సంవత్సరంగా తెలంగాణ జాగృతి బీసీల కోసం చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తూ, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ రచించిన 'బీసీ చౌక్' అనే పుస్తకాన్ని శ్రీకాంత్ గౌడ్, కవితకు అందించారు. బీసీ సాహితీపరులను ఏకం చేసి ఇలాంటి పుస్తకాలను మరెన్నో తీసుకురావాలని ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ కవితను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ కవిత, ఆ దిశగా త్వరలో కొన్ని కార్యక్రమాలు చేపడతామని తెలియజేసినట్లు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## పెండింగ్ రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలి




### ◆ పీడీఎస్‌యూ డిమాండ్

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) హనుమకొండ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉత్తరాలు రాసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు పై చదువులకు ఆటంకాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేసి, పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సహించాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక కళాశాలలు సమ్మె వైపు అడుగులు వేస్తుంటే, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని వారు మండిపడ్డారు. డిగ్రీలు పూర్తయినప్పటికీ, ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా విద్యార్థులు పై చదువులు చదవలేక, విద్యను మధ్యలోనే ఆపేసే పరిస్థితులు నేడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను విద్యార్థులకు నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థులు రాబోయే ఎన్నికలలో కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే మీకు కూడా పడుతుందని పీడీఎస్‌యూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముషరాఫ్ పృథ్వీ, హర్షత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీవి తప్పుడు ఆరోపణలు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, బీజేపీ నాయకులు ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు సమస్యలను తెరపైకి తెస్తున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు తీవ్రంగా ఆరోపించారు. హుజురాబాద్‌లోని అంబేద్కర్ భవన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అడ్డుపడలేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన పొన్నం ప్రభాకర్, తమ ఎంపీ నిధుల నుంచి ఎన్నో అంబేద్కర్ భవనాలను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందని సందమల్ల బాబు గుర్తు చేశారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే, రెండుసార్లు కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా ఉండి ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్‌తో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఆయన సవాల్ విసిరారు. దళిత బంధు పథకం విషయంలో కూడా బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని సందమల్ల బాబు మండిపడ్డారు. దళిత బంధును ఎన్నికల సందర్భంగా లబ్ధి పొందేందుకే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, దళిత బంధు లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా ప్రతి లబ్ధిదారుడికి న్యాయం చేయాలని సంకల్పించిందని తెలిపారు. ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ పెద్దలతో, మంత్రులతో సంప్రదింపులు జరిపి, రెండో విడత నిధులు విడుదలయ్యేలా హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వోడితల ప్రణవ్ బాబు కృషి చేశారని సందమల్ల బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుబాసి బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిని రవీందర్ గౌడ్, ముక్క రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొ. ప్రభంజన్ యాదవ్ మృతిపై వినోద్ కుమార్ సంతాపం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రభంజన్ యాదవ్ కీలక పాత్ర పోషించారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారిగా ఢిల్లీలో ఉన్నత ఉద్యోగంలో కొనసాగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం ప్రభంజన్ యాదవ్ ఉద్యమ నిబద్ధతకు నిదర్శనమని వినోద్ కుమార్ కొనియాడారు. మహాత్మా జ్యోతిబా పూలే, బీఆర్ అంబేద్కర్ ఆలోచనా దృక్పథంతో, బీసీ వర్గాల హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం ప్రభంజన్ యాదవ్ నిరంతరం కృషి చేశారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ప్రభంజన్ యాదవ్ కుటుంబ సభ్యులకు వినోద్ కుమార్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలిపారు.

## ప్రభంజన్ యాదవ్ మృతిపై కవులు, కళాకారుల సంతాపం



**వరంగల్ వాయిస్, జనగామ:** తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ పోరాట యోధుడు, కవి, రచయిత ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మృతిపట్ల జనగామ జిల్లా కవులు, కళాకారులు బుధవారం సంయుక్తంగా సంతాపం ప్రకటించారు. జనగామ జిల్లా పాలకుర్తి, గూడూరు గ్రామానికి చెందిన ప్రభంజన్ యాదవ్ బుధవారం ఉదయం అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. సంతాపం ప్రకటించిన వారిలో పెట్లోజు సోమేశ్వరాచారి, జి. కృష్ణ, అయిలా సోమనరసింహచారి, పానుగంటి రామమూర్తి, కోడం కుమారస్వామి, నక్క సురేష్, గడ్డం మనోజ్ కుమార్, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, నిమ్మ జైపాల్ రెడ్డి, డాక్టర్ వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, చిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్, కె. జగదీశ్వరి, కొట్టె శ్రీలత, బుదారపు లావణ్య


## పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా ఎదిగి దేశానికి, సమాజాభివృద్ధికి పాటుపడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిసా పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం వల్ల భవిష్యత్తులో వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు. విద్యార్థి నాయకులు పాఠశాల నియమాలు, విలువలు పాటిస్తూ తమ బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. నాయకత్వం కేవలం రాజకీయ రంగానికే పరిమితం కాదని, అన్ని రంగాల్లో నాయకత్వ లక్షణం వ్యక్తి ఎదుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే వారు భవిష్యత్తులో అన్ని ఒడిదొడుకులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడగలరని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని మహబూబాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ మీటింగ్ హాల్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధి గ్రంథాలయ పన్నుపై ఆధారపడి ఉంటుందని గుర్తు చేశారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసిన గ్రంథాలయ పన్నును ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించి, గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని అధికారులను కోరారు. జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం అధికారుల సహకారంతో పాటు, ప్రజల భాగస్వామ్యం, మహాదాతల దాతృత్వం ఎంతో అవసరమని ఆయన ఉద్ఘాటించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, మరిపెడ మున్సిపల్ కమిషనర్ విజయ్ ఆనంద్, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నిరంజన్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్ వి. శ్యాంసుందర్, జిల్లా ఆడిట్ అధికారి మాన్వి జగన్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ లావణ్య, సీనియర్ ఆడిటర్ సంపత్, కె. దేవేందర్, రుద్రారపు వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేటలోని జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం నివారణపై అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన జాగృతి పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నర్సంపేట సీఐ ఎస్.శ్రీనివాస్, చెన్నారావుపేట ఎస్ఐ జి.రాజేశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు విద్యార్థులకు మాదకద్రవ్యాల వినాశకర ప్రభావాలను వివరంగా తెలియజేశారు. మాదకద్రవ్యాలు ఒక వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని ఎలా నాశనం చేస్తాయో స్పష్టంగా వివరించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకున్నారు. "మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. మాదకద్రవ్యాలకు నో చెప్పి ఆరోగ్యవంతమైన జీవితం గడిద్దాం" అనే సందేశాన్ని వారు బలంగా పునరుద్ఘాటించారు. జాగృతి పోలీస్ కళాబృందం ప్రదర్శించిన పాటలు,



నాటకాలు, నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి వినూత్న ప్రదర్శనలు విద్యార్థులలో చైతన్యం రేకెత్తించాయి. ఈ కళాబృందం తమ సందేశాత్మక ప్రదర్శనల ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తేటతెల్లం చేస్తూ, యువతను మంచి మార్గంలో నడిపించడానికి కృషి చేస్తోంది. వారి ప్రదర్శనలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఓఎస్డీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.వి.జానకి, డీన్ ఆఫ్ అకాడెమిక్స్ డా.హమీద్ పాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.సందీప్, పీడీలు ఎల్. వేంగల్ రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వీడిన రేగొండ హత్య కేసు మిస్టరీ

◆ ఆరుగురు నిందితుల అరెస్టు



**వరంగల్ వాయిస్, రేగొండ:** ఉమ్మడి రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులోని బుగులోని వెంకటేశ్వరస్వామి జాతర సమీపంలో ఈ నెల 10న జరిగిన హత్య కేసు మిస్టరీ వీడింది. పోలీసులు పక్కా ఆధారాలతో కేవలం ఐదు రోజుల్లోనే కేసును ఛేదించి, నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. బుధవారం రేగొండ పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై సందీప్ కుమార్‌లతో కలిసి డీఎస్పీ సంపత్ రావు విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. మృతుడు రవి, తన తల్లి రేణుకతో అక్రమ సంబంధం ఉందని అనుమానంతో ఆమెను శారీరకంగా హింసిస్తున్నాడని, పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతోనే ఈ హత్యకు పథకం పన్నారని డీఎస్పీ వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొంపల్లి గ్రామానికి చెందిన రేణుక అనే మహిళతో రవి అక్రమ సంబంధం పెట్టుకొని జీవిస్తున్నాడు. కొంతకాలంగా రేణుకను అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో రవి వేధించడం, శారీరకంగా హింసించడం చేస్తుండేవాడు. ఈ విషయంపై పలుమార్లు గ్రామ పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ రవి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, రేణుక, ఆమె కొడుకు శ్రీకర్, కొంపల్లి గ్రామానికి చెందిన శ్రీపాల్లు ముగ్గురు కలిసి రవిని హత్య చేయాలని పథకం పన్నారు. ఈ పథకంలో భాగంగా శ్రీకర్ హనుమకొండకు చెందిన బొమ్మకంటే ఉదయ్ చందన్‌ను సంప్రదించి రవిని హత్య చేయడానికి సహాయం కోరాడు. ఉదయ్ చందర్ తన బంధువులైన సందీప్, నరేష్‌లను సంప్రదించి రూ. 1,50,000కు ఒప్పందం కుదుర్చుకున్నారు. శ్రీపాల్ ఈ ఒప్పందంలో ఆర్థిక సహాయం అందించాడు. మొదట రూ. 25,000 నగదు, తర్వాత రూ. 14,000, ఆ తర్వాత రూ. 3,000, రూ. 10,000 గూగుల్ పే ద్వారా ఉదయ్ చందర్‌కు అందించారు. రవిని హత్య చేసేందుకు హనుమకొండలో సురేష్‌కు చెందిన మారుతి సుజుకి డిజైర్ (TS03UD2383) కారును అద్దెకు తీసుకొని, హత్య చేయడానికి తిరుమలగిరి గ్రామ శివారులోని బుగులోని వేంకటేశ్వరస్వామి గుట్టలను ఎంచుకొని అక్కడి స్థలంలో రెక్కీ చేశారు. పథకం ప్రకారం పాతపల్లి శ్రీకర్, కొంపల్లి రేణుక, బొమ్మకంటి ఉదయ్ (రేగొండ మండలం దమ్మన్నపేట), పసుల సందీప్ (దమ్మన్నపేట), ములుగురి నరేష్ (దమ్మన్నపేట), కాయిత శ్రీపాల్ (కొంపల్లి) ఈ ఆరుగురు కలిసి రవిని కారులో ఎక్కించుకొని, అతని మొదటి భార్య కొడుక్కి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. కొంపల్లి శివారులోని వైన్ షాప్ వద్ద మద్యం సేవించి, నిందితులు తాగినట్టు నటిస్తూ అర్ధరాత్రి తిరుమలగిరి బుగులోని గుట్టల వద్ద రవిని తాడుతో ఉరివేసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం శవాన్ని చెట్ల పొదల్లో విసిరేసి, రవి జేబులో నుంచి రూ. 20,000 తీసుకెళ్లారు. హత్యకు ఉపయోగించిన తాడును గద్దెల వద్ద పడేసి వెళ్లారని పోలీసులు తెలిపారు. రవి హత్య అనంతరం అతని మొదటి భార్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు హనుమకొండలో తలదాచుకున్నారు. బుధవారం రేగొండ ఎస్సై సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీకర్ సెల్ ఫోన్‌లోని ఫోటోలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకర్ వాంగ్మూలం ఆధారంగా హత్య జరిగిన స్థలం నుంచి తాడు వివరాలను సేకరించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, రేగొండ ఎస్సై ఎన్.సందీప్ కుమార్, సెకండ్ ఎస్సై మహమ్మద్ షా ఖాన్, ఉమెన్ ఎస్సై దివ్య, పోలీస్ సిబ్బంది లింగమూర్తి గౌడ్, సాట్ల ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే రేవూరి సమీక్ష



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పరకాల టౌన్, మండలాల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామాలు, వార్డుల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సమగ్రంగా సమీక్షించారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇళ్లను దశలవారీగా మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుంటే, అదనంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశలవారీగా బిల్లులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదింటి వారి సొంత ఇంటి కల నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

◆ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య



**వరంగల్ వాయిస్, రేగొండ:** గోరి కొత్తపల్లి మండల అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు గండ్ర సత్యనారాయణపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని రేగొండ మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బుధవారం రేగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ ఫలాలను ఓర్చుకోలేక మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి దంపతులు ఎమ్మెల్యే సత్యనారాయణపై అసత్యపు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 18 నెలల్లో రూ. 300 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టిందని, అందులో గోరి కొత్తపల్లి మండలానికి ఆయా శాఖల కార్యాలయాలకు శంకుస్థాపనలు చేశారని తెలిపారు. ఇటీవల పోలీస్ స్టేషన్ కొరకు స్థల పరిశీలన కూడా చేశారని, అదేవిధంగా మండలంలోని కులాలవారీగా కమ్యూనిటీ హాళ్లను కూడా నిర్మించారని అన్నారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలు చేసి పబ్బం గడపడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మాజీ చీఫ్ విప్ గండ్ర రమణారెడ్డి చిల్లర మాటలు మానుకోవాలని, లేదంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, భూపాలపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ గుటోజు కిష్టయ్య, రేగొండ మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్, రేగొండ మాజీ ఉప సర్పంచ్ గండి తిరుపతి గౌడ్, గోరి కొత్తపల్లి మాజీ సర్పంచ్ సూధనబోయిన ఓం ప్రకాష్, ఉమ్మడి మండల బీసీ సెల్ అధ్యక్షులు పొనుగోటి వీరబ్రహ్మం, మండల నాయకులు తోకల సురేందర్ రెడ్డి, బాలయ్య పల్లె మాజీ ఉపసర్పంచ్ తొట్ల రవీందర్, మండల నాయకులు బండి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరుగొండ శివ నాగేంద్ర స్వామి ఆలయంలో ఎండోమెంట్ అధికారి పరిశీలన

వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ శివ నాగేంద్ర స్వామి ఆలయం వద్ద "భక్తి ముసుగులో దోపిడీ" అనే శీర్షికతో 'వరంగల్ వాయిస్' ప్రచురించిన వార్తకు ఎండోమెంట్ అధికారి అనిల్ కుమార్ స్పందించారు. బుధవారం ఆయన శివ నాగేంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పూజ కార్యక్రమాలు, ఇతర విషయాలపై ఆలయ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఆలయాన్ని మరోసారి సందర్శించి, అక్కడ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతర అంశాలపై జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

# జవాన్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

నగర మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పారిశుద్ధ్య జవాన్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలిసి పారిశుద్ధ్య జవాన్లతో మేయర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య జవాన్ల సేవలు వెలకట్ట లేనివని, వారు లేనిదే ప్రజారోగ్యం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మన సమాజానికి వెన్నెముక వంటి వారన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తూ వీధులు మురికివాడలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం ద్వారా వ్యాధులు రాకుండా చూడాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మ గౌరవంతో జీవించాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, హసన్ పర్తి మండలాల స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ, ప్రమాదబీమా, రుణబీమా, మహిళా సంఘాల ద్వారా నడుపుతున్న ఆర్టీసీ బస్సుకు అద్దె చెల్లింపులు, నూతన రేషన్ కార్డుల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, సెర్ప్ డైరెక్టర్ నవీన్, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీవోలు కౌసల్యాదేవి, మెనూ శ్రీను, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, నాలుగు మండలాల సింగిల్ విండో చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణంపై అవగాహన కల్పించాలి



**వరంగల్ వాయిస్, జనగామ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా, జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ శ్రీకారం చుట్టారు. జనగామ పట్టణాన్ని నివాసయోగ్యమైన, స్థిరమైన, పర్యావరణ అనుకూల నగరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఒకటో వార్డులోని గురుకుల పాఠశాలలో 200 మొక్కలు నాటి పర్యావరణ అనుకూలతకై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పిల్లలకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అడుప రమేష్, ఉపాధ్యక్షుడిగా మారెల్లి చిన్నసాంబయ్య, కార్యదర్శిగా చిన్న పెల్లి బిక్షపతి, కోశాధికారిగా తోట రవిబాబు, యువజన సంఘం కోశాధికారిగా అడుప మహేష్ , కార్యవర్గ సభ్యులు( డైరెక్టర్లు) గా అడుప యాకయ్య, మర్రి రాజు, బొజ్జ విజయ్ ,బండి గణేష్ ,మాసాడి రమేష్, తోట రాములను ఎన్నుకున్నారు.

# కరెంట్ మోటార్ల చోరీ

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని హౌజుబుజుర్గు గ్రామంలో బుధవారం కరెంట్ మోటార్ల చోరీ జరిగినట్లు సీఐ ఆర్. సంతోష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన రైతులు సయ్యద్ వలీ, పెండల సారయ్యలు కటాక్షపూర్ చెరువు కట్ట కింద ఉన్న తమ పొలాల వద్ద కరెంట్ మోటార్లను ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సయ్యద్ వలికి చెందిన 5 హెచ్‌పీ కరెంట్ మోటారును, పెండల సారయ్యకు చెందిన 3 హెచ్‌పీ మోటారును దొంగలించినట్లు బుధవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. ఈ చోరీ ఘటనతో రైతులు నష్టపోయారు.

# మెడికల్ స్టోర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మహాన్ మెడికల్ స్టోర్ ను బుధవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు, నాణ్యమైన మందులను అందించాలని స్టోర్ యజమానులకు సూచించారు. అనంతరం స్టోర్ యజమాని తలగంప రాజు దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కుంకుమేశ్వర ఆలయ ఛైర్మన్ రాజేశ్వరరావు, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, నాయకులు పర్నెం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘అధినేత్రి’తో మహిళా సాధికారతకు పెద్దపీట

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మహిళలను రాజకీయంగా చైతన్యపరచడం, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో “అధినేత్రి – ఆలోచన! అధ్యయనం! ఆచరణ!” పేరుతో మహిళా నాయకత్వ శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ శ్రీ చిన్నారెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు రాజకీయ రంగంలోకి వస్తేనే సమాజం నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని, నాయకత్వం చూపే మహిళలకు మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు. మహిళలు సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటిని ఆచరణలోకి తేవడం ద్వారా సమాజం మెరుగుపడుతుందని, అలాంటి నాయకులను తయారు చేయడం కోసమే ఈ శిక్షణ శిబిరం అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, యువజన మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు సాగరిక, శ్వేత, ఇతర మహిళా కాంగ్రెస్ నేతలు, మహిళా మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన విభాగ నాయకులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయం (డీఈఓ) ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ వాసంతికి అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి బకాయి వేతనాలు ఇవ్వకుండా కార్మికులు ఎలా పనిచేస్తారని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ ఇవ్వకుండా, పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు గ్యాస్‌పై వంట చేయాలని ఒత్తిడి తీసుకురావడం సరైంది కాదని రజిత అన్నారు. గ్యాస్ సబ్సిడీని ఇస్తూ ఉచితంగా గ్యాస్‌ను అందించాలని ఆమె డిమాండ్ చేశారు. కోడిగుడ్ల బకాయి డబ్బులను తక్షణమే కార్మికులకు అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏ విధంగా అయితే కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారో అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించాలనే ఆలోచనను విరమించుకోవాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 కల్పించి, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రజిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. శాంత, ఎండీ పర్వీన్, జీ. లక్ష్మి, సునీత, మమత, రేవతి, జీజియా తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి పాఠశాల అభివృద్ధికి సమష్టిగా సహకరిస్తాం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట:** చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 70 మందికి పైగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల నూతన అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, పఠనాభ్యాస పురోగతి, నాణ్యత వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా అభివృద్ధి చేయడానికి తగిన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలలో మండలం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బహుమతులు పొందడాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ విద్యా సంవత్సరంలో 40 మందికి పైగా కొత్త విద్యార్థులు పాఠశాలలో నమోదు కావడం, పదవ తరగతి విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. 70 మందికి పైగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, సిహెచ్. మాధవి, ఎల్. మొగిలి, జి. సుందర్, కె. మాధవి, వర్దెల్లి సతీష్ కుమార్, రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, హంస రామకృష్ణ, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, జూనియర్ అసిస్టెంట్లు జాహేద్, షాదాబ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

◆ హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



**వరంగల్ వాయిస్, నడికూడ:** హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య బుధవారం రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆయన పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా డాక్టర్ అప్పయ్య తొలుత నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించారు. సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించి, ఉపకేంద్రాలకు వచ్చిన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. నార్లాపూర్ సబ్ సెంటర్‌లో విద్యుత్ సౌకర్యం లేదని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురాగా, త్వరలోనే విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తానని డీఎంహెచ్ఓ హామీ ఇచ్చారు. అనంతరం చర్లపల్లి ఉపకేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందుతున్న ఆరోగ్య సేవలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉపకేంద్రంలోనూ, గ్రామాల్లోనూ అందిస్తున్న సేవలను సరైన రికార్డులలో పొందుపరచాలని, అవి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి బుధవారం పీహెచ్‌సీలలో నిర్వహించే సిబ్బంది సమావేశంలో పాల్గొనేందుకు డాక్టర్ అప్పయ్య రాయపర్తి పీహెచ్‌సీకి హాజరయ్యారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఆశ కార్యకర్త, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు ప్రతిరోజూ గృహ సందర్శనలు చేపట్టి, జ్వరం కేసులకు చికిత్స అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా కంఠాత్మకూర్ గ్రామంలో ఎక్కువ జ్వరం కేసులు నమోదవుతున్నాయని గుర్తించి, వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలని సూచించారు. గర్భిణీ స్త్రీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం అయ్యే విధంగా బర్త్ ప్లానింగ్ చేయాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని కోరారు.

# ఆగస్ట్‌లో రాజాసాబ్ ఫస్ట్ సింగిల్

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ప్రభాస్‌కి ఉన్న స్థానం ప్రత్యేకమైనది. 'బాహుబలి' తర్వాత ఆయన సెలబ్రిటీ- స్టేటస్ అంతర్జాతీయంగా పెరిగింది. దీంతో ఆయన ప్రతి సినిమా మీదా అభిమానుల్లో, ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన అంచనాలు నెలకొంటున్నాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మాస్ ఎంటర్-టైనర్ 'ది రాజా సాబ్' మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో అత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ నుండి రీసెంట్‌గా విడుదలైన టీజర్‌లో ప్రభాస్ విభిన్న లుక్స్‌తో, కామెడీ, హీరోయిజం రెండు చూపించి అంచనాలు రెట్టింపు చేశాడు. మారుతి ప్రభాస్‌తో ఏదో అద్భుతం చేస్తున్నాడు అని క్లియర్‌గా అర్థం అవుతుంది. ఇందులో మాళవిక మోహన్, నిధి అగర్వాల్,రిద్ధి కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా, తాజాగా ఈ మూవీ నుంచి ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ బయటికి వచ్చింది. అదే ఫస్ట్ సింగిల్ గురించి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'ది రాజా సాబ్' నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఆగస్ట్ మొదటి వారంలో విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది. ఇది ప్రభాస్ పైనే డిజైన్ చేసిన సోలో మాస్ సాంగ్ అని సమాచారం. ప్రస్తుత టాలీవుడ్ ట్రెండ్‌ను బట్టి చూస్తే, థమన్ సాగే మాస్ బీట్, విజువల్స్‌తో ఈ పాటకు మంచి వర్షన్ వచ్చే అవకాశం ఉందట. ఇటీ-వలే విడుదలైన టీజర్‌కి మాస్ రెస్పాన్స్ రాగా, థమన్ అందించిన మ్యూజిక్‌కి ప్రత్యేకంగా ప్రశంసలు లభించాయి. ఇదే ఊపులో, తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం ప్రభాస్‌పై ప్రత్యేకంగా తెరకెక్కిన సోలో సాంగ్‌కు కూడా, తన మాస్ మేజిక్‌ని చూపించబోతున్నారట.






# వార్-2పె పెరుగుతున్న అంచనాలు

డిఫరెంట్ రోల్‌తో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఆడియన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో హృతిక్ రోషన్, –టైగర్ ష్రాఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మూవీ భారీ హిట్ అయ్యింది. అదే సిరీస్‌కు ఇది సీక్వెల్. ఈసారి కథ మరింత ఇంటెన్స్‌గా ఉండబోతుందన్న అంచనాలు ఉన్నాయి. హృతిక్ మళ్లీ రా ఏజెంట్ మేజర్ కబీర్ ధాలివాల్ పాత్రలో కనిపించబోతుండగా, ఎన్టీఆర్ తొలిసారిగా హిందీ లో పెద్ద స్కోప్ ఉన్న ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా, అలాగే, యష్ రాజ్ ఫిలిమ్స్ అధినేత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇక కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ నుంచి, అభిమానుల ఎదురు చూపులకు చెక్ పెడుతూ తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి కౌంట్‌డౌన్ పోస్టర్ విడుదలై బజ్ పెంచింది. తాజాగా విడుదలైన ఈ కౌంట్‌డౌన్ పోస్టర్‌లో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. మాస్క్‌తో, టెన్నింగ్ గ్లాస్‌లు ధరించి, బ్లాక్ గేర్‌లో కనిపించిన ఎన్టీఆర్ లుక్ ఫ్యాన్స్‌కి ఫుల్ మాస్ హై ఇచ్చింది. ఆయన ఎక్స్ వేదికగా ఈ పోస్టర్‌ను పంచుకోవడం కూడా మరో హైలైట్. ఇక అభిమానులు 'విలన్ అయినా వీర్‌గా ఉన్నాడు', 'డార్క్ షేడ్స్‌లో ఎన్టీఆర్ ఓ రేంజ్' అంటూ కామెంట్లతో సోషల్ మీడియాలో ముంచెత్తుతున్నారు.






# ఏ సినిమాలో నటించకున్నా హిట్ కొట్టబోతున్నా

బాహుబలి రీ రిలీజ్ పై రానా వ్యాఖ్య

రాజమౌళి సృష్టించిన కలాఖండం బాహుబలి మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 31న దీన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. అయితే రెండు పార్టులను కలిపి ఒకే దాంట్లో చూపిస్తామని ఇప్పటికే రాజమౌళి ప్రకటించారు. రెండు పార్టులు అంటే రన్ టైమ్ భారీగా ఉంటుందనే ప్రచారం మొదలైంది. కొందరేమో 5 గంటలు ఉంటుందని.. ఇంకొందరేమో 4 గంటలకు పైగా ఉంటుందని పోస్టులు పెడుతున్నారు. మరీ అన్ని గంటలు అంటే థియేటర్లలో ప్రేక్షకులు చూస్తారా అంటూ నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. ఈ టైమ్ లో హీరో రానా స్పందించారు. ఆయన నిర్మాతగా వ్యవహరించిన 'కొత్తపల్లిలో ఒకరోజు' మూవీ 18న రిలీజ్ కాబోతోంది. రానా వరుసగా ప్రమోషన్లలో పాల్గొంటున్నాడు. ఓ ఇంటర్వ్యూలో బాహుబలి రన్ –టైమ్ గురించి ప్రశ్న ఎదురవగా స్పందించాడు.

'రన్ టైమ్ ఎంత ఉన్నా నాకు హ్యాపీనే. ఎందుకంటే నేను ఈ ఏడాది ఎలాంటి సినిమాలు చేయకపోయినా నాకు బ్లాక్ బస్టర్ రాబోతోంది. కొందరేమో 5 గంటలు అంటూ పోస్టులు పెడుతున్నారు. అన్ని గంటలు ప్రేక్షకులు సీట్లలో కూర్చుంటారా లేదా అన్నది సందేహమే. కానీ రాజమౌళి ఏం చేసినా ఆలోచించే చేస్తారనే నమ్మకం నాకుంది. రన్ టైమ్ గురించి నాకు ఎలాంటి క్లారిటీ లేదు. దాని గురించి రాజమౌళికే తెలియాలి. ఆయన నాకేం చెప్పలేదు. రన్ –టైమ్ విషయంలో ఎలాంటి టె–న్షన్ పడాల్సిన అవసరం లేదు. ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకునే రాజమౌళి డిజైన్ చేస్తారు అంటూ తెలిపాడు. అక్టోబర్ 31న ది బాహుబలి– ఎపిక్ పేరుతో సినిమాను రిలీజ్ చేయబోతున్నారు. బాహుబలి రెండు పార్టుల్లోని కథకు ఎక్కడా భంగం కలగకుండా ఒకే సినిమాగా తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.



# ఓటీటీకి రెడీ అవుతున్న తమ్ముడు

వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న నితిన్.. ఈసారి కెరీర్‌లో నిలబడాలంటే ఖచ్చితంగా హిట్ కొట్టాలనే ఉద్దేశంతో 'తమ్ముడు' సినిమాకు ఓకే చెప్పారు. కానీ దర్శకుడు వేణు శ్రీరామ్ తెరకెక్కించిన ఈ మూవీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. వర్ష బొల్లమ్మ – సప్తమి గౌడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం, జూలై 4న థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్‌తో కలెక్షన్ల పరంగా బలహీనపడిరది. ఈ మూవీతో హిట్ కొట్టాలని అనుకున్న నితిన్ కలలు కల్లలయ్యాయి. బాక్సాఫీస్ జర్నీ ప్రారంభించినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఈ చిత్రం పాజిటివ్ రిజల్ట్ చూపించలేకపోయింది. కీలకమైన వీకెండ్‌లోనూ కనీస కలెక్షన్ కూడా రాలేదు. దీంతో, చిత్రబృందం త్వరగానే ఓటీటీ రిలీజ్‌కు మారుతున్నట్లు– తెలుస్తోంది. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఆగస్టు 1 నుంచి స్ట్రీమింగ్ కి వచ్చేస్తుందిని తెలుస్తుంది.





# ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతా..

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
- నియోజకవర్గ అభివృద్దే నా ఏకైక ఎజెండా
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** రాష్ట్రం సంక్షేమ పథకాల అమలులో దేశానికే రోల్ మాడల్ గా నిలుస్తోందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్ గడ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గత 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలోనే రేషన్ కార్డుల కల సాకారం అయిందన్నారు. జనగామ జిల్లాలో 9,700 కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, 14,780 మంది కొత్త సభ్యుల చేర్పులు జరిగాయన్నారు. అలాగే జఫర్ గడ్ మండలంలో 648 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా, 859 మంది కొత్త సభ్యుల చేరారన్నారు. ఇంకా రేషన్ కార్డు లేని వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని వివరించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ ఒక చరిత్ర అని కొనియాడారు. ప్రతిపక్షాలు కావాలని ప్రభుత్వంపై విమర్శలు చెస్తున్నాయని ఆరోపించారు. చేతకాని వారు, చేయలేనివారు చాలా మాట్లాడుతారని ఏద్దేవా చేశారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ.21వేల కోట్ల రుణ మాఫీ చేసిన రికార్డ్ కాంగ్రెస్ ప్రభుత్వానిది అని పేర్కొన్నారు. త్వరలోనే నూతన పెన్షన్లు కూడా మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు. గత 10 ఏళ్లు అధికారంలో ఉన్న వాళ్లు ఎలా కేసుల పాలు అవుతున్నారో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని వివరించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతానన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నాకున్న ఏకైక ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డీఎస్ఓ, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కళాఖండాలు ఉంటే ఇవ్వండి

- చరిత్ర పరిరక్షణ, భవిష్యత్ తరాల అవగాహనకు సేకరణ
- జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న
- ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు విజ్ఞప్తి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్రను అర్థం చేసుకోవడానికి, నంరక్షించడానికి, ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గతం గురించి లోతైన అధ్యయనం చేయడానికి ఉపయోగపడే పురాతన వస్తువులు, కళాఖండాలను జానపద గిరిజన విజ్ఞాన పీఠానికి అందజేయాలని పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న కోరారు. బుధవారం వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో జరిగిన సమావేశంలో పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ జానపద గిరిజన విజ్ఞాన పీఠం స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిందని గుర్తుచేశారు. పీఠంలో అరుదైన జానపద వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పూర్వపు సమాజాన్ని, సంస్కృతి, జీవన విధానం, చారిత్రక వస్తువులను చూడటం ద్వారా చరిత్రను బాగా అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మ్యూజియంలోని వస్తువులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ తరాలకు చరిత్రను తెలుసుకోవడానికి సహాయపడతాయని అన్నారు. చరిత్ర పరిరక్షణ, పూర్వపు మానవ చరిత్ర, సంస్కృతి, రాజకీయ, సాంకేతిక, సామాజికంగా ఎలా జీవించారు, వారి నమ్మకాలు, వారి అవసరాలకు ఉపయోగించిన వస్తువులు, కాలక్రమేణా వారు ఎలా అభివృద్ధి చెందారు అనే విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఒక ప్రాంతం యొక్క సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించడానికి, రక్షించడానికి, పరిశోధనలు నిర్వహించడానికి వస్తువులను సేకరిస్తున్నామని తెలిపారు. ఇందు కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు తమ దగ్గర ఉన్న ఉపయోగంలో ఉన్నా లేకపోయినా పురాతనమైన చరిత్రక వస్తువులను, కళాఖండాలను, పూర్వకాలంలో ఉపయోగించిన రాతి, లోహ, చెక్క సంబంధమైన వంటసామాను, ఇంటి సామాను, పనిముట్లు తదితర విలువైన వస్తువులను గిరిజన పీఠంలో అందజేయాలని కోరారు. వస్తువులు అందజేసిన వారి వివరాలను పీఠంలో నమోదు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని నురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# జవాబుదారీగా ఉండాలి

- అదే పోలీసుల కర్తవ్యం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం అందించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సీపీ బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ విభాగాల పనీతీరును అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పేర్కొన్నారు. పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్సైలు నవీన్‌కుమార్, లవణ్‌కుమార్, శివ సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాఫిక్ స్టేషన్ సందర్శన..

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న పలు రికార్డును పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో స్వాధీనం చేసుకున్న వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, సిబ్బంది పనితీరుపై ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు.

# ప్రభంజన్ మరణం బీసీ ఉద్యమాలకు తీరని లోటు

## బీసీ సంఘాల సమన్వయ కర్త పరశురాములు



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ కోసం, బీసీల రాజ్యాధికారం కోసం పరితపించిన నాయకుడు ప్రభంజన్ యాదవ్ అని బీసీ సంఘాల సమన్వయ కర్త పరశురాములు కొనియాడారు. జనగామ గడ్డన పుట్టిన ప్రభంజన్ బీసీల రాజ్యాధికార లక్ష్యం నెరవేరకుండానే మరణించటం బీసీ ఉద్యమాలకు తీరని లోటన్నారు. చివరి అంకంలో కూడా తన సహజత్వంతో మొండిగా వ్యవరించి బంధువులు, మిత్రులను శోకంలో ముంచి భువి నుంచి దివికేగిన ప్రభంజన్ ఆత్మకు శాంతి, సద్గతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు కన్న పరశురాములు ప్రకటనలో తెలిపారు.

# ఆయిల్ పామ్ తో అధిక లాభాలు

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు ఉన్నాయని, రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు రావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం గుండ్ల సాగర్ గ్రామంలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న రైతు మంద సారంగపాణి తన పంట క్షేత్రంలో ఆయిల్ పామ్ గెలల మొదటి కోత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. మిగతా పంటల కంటే ఆయిల్ పామ్ పంటకు రైతులకు మంచి గిట్టుబాటు అయ్యే ఆదాయం లభిస్తుందన్నారు. అధిక విస్తీర్ణంలోఆయిల్ పామ్ పంటను సాగు చేసిన రైతు మంద సారంగపాణిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు వ్యవసాయ అధికారులు, వేలేరు, ధర్మసాగర్ భీమదేవరపల్లి, హసన్ పర్తి, ఐనవోలు, కాజీపేట, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com